క్లుప్తంగా

పద్మశ్రీ మంద కృష్ణకు శుభాకాంక్షలు



మందకృష్ణతో పట్నం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: సామాజిక ఉద్యమ కారుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వరించిన సందర్భంగా నగరంలోని ఆయన నివాసంలో సోమవారం మాదిగ జేఏసీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం గౌరవ అధ్యక్షుడు ప్రతాప్, మహేందర్, అమరేందర్, నర్సింహ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మాదిగ జాతి ముద్దుబిడ్డకు ఇంత పెద్ద పురస్కారం రావడం గర్వకారణమని కొనియాడారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ యాదయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఎస్ఐగా పదోన్నతి పొందిన యాదయ్యను సోమవారం సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల శ్రీను, వెంకట్‌రెడ్డి, సింగిని శ్రీనివాస్, బుచ్చయ్య, జంగయ్యగౌడ్, రవి పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడవాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాత

కడ్తాల్: చిన్ననాటి నుంచే మహనీయులను ఆదర్శంగా తీసుకుని, వారి బాటలో పయనించాలని యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐక్యవేదిక, వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో పర్యావరణ రక్షణకు మొక్కలు నాటడంతో పాటు, మండల పరిధి గుర్లకుంటతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని సూచించారు. భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇందులో వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: తలకొండపల్లి మాజీ సర్పంచ్ నిర్మల భర్త జంగయ్య ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం నిర్మల కుటుంబ సభ్యులను వేర్వేరుగా కలిసి పరామర్శించారు. వీరి వెంట సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జ్యోతయ్య, గోపాల్‌నాయక్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ అనిత

ఆమనగల్లు: మండల పరిధి మేడిగడ్డతండాలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ అనిత, ప్రత్యేక అధికారి వినోదలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. సీసీరోడ్డుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్‌రాథోడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పరమేశ్వర్, ఏఈ అభిషేక్, గ్రామ కార్యదర్శి వెంకటయ్య, నాయకులు కృష్ణ, రాంజ్యానాయక్, కిషన్, హరిలాల్, రఘు, కల్యాణ్ పాల్గొన్నారు.

నూతన నియామకం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడ సామ రెసిడెన్సి కాలనీ అసోసియేషన్‌ను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.శివ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా పగిళ్ల శ్రీను, కోశాధికారిగా సుదర్శన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా యాదయ్య, ఆనంద్ రెడ్డి, శ్రీను, మహిపాల్ రెడ్డి, చంద్రశేఖర్, రాజులను నియమించారు.

అసౌకర్యాల సంత!

అనుకున్న మేర ఆదాయం ఉన్నా.. సంతలో సౌకర్యాలు కల్పించడంలో పంచాయతీ అధికారులు విఫలం అయ్యారు. ఫలితంగా క్రయవిక్రయదారులకు ఇబ్బంది తప్పడం లేదు. ఇరుకైన స్థలంలో వసతుల లేమితో అంగడి కొట్టుమిట్టాడుతోంది.

క్రయవిక్రయదారుల చింత
- ఆదాయం ఘనం.. వసతులు శూన్యం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం



ఇరుకు వీధిలో కొనసాగుతున్న కడ్తాల్ సంత

కడ్తాల్: మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే సంతకు స్థానికులతో పాటు చుట్టుపక్కల వ్యాపారులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చిపోతుంటారు. 30 నుంచి 40 వరకు తండాలు, గ్రామాల రైతులు తమ వ్యవసాయ పొలాల్లో పండించిన కూరగాయలు, తదితర ఉత్పత్తులను ఇక్కడే విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

తరచూ తగాదాలు

సంతకు సొంత స్థలం లేక చాలా కాలంగా గ్రామంలోని గాంధీనగర్ వీధిలో కొనసాగుతోంది. దీంతో తరచూ తగాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారికి ఇరువైపులా దుకాణ సముదాయల ముందే చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులను విక్రయిస్తుండటంతో, తమకు ఇబ్బందిగా ఉందని దుకాణదారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. పైగా ఇరుకైన స్థలం కావడంతో సంత రోజున రద్దీతో సందడిగా ఉంటుంది. దీంతో గాంధీనగర్ రహదారి మీదుగా రాకపోకలు సాగించే మక్తమాధారం, పెద్దారెడ్డి చెరువు, కొండ్రిగానిబోడ్, పిల్లిగుండుతండాల ప్రజల ఇబ్బంది పడుతున్నారు. వర్షకాలంలో ఇక్కట్లు చెప్పనలవి.

లక్షల్లో ఆదాయం

సంత ద్వారా గ్రామ పంచాయతీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. ఏటేటా పెరుగుతూనే ఉంది. ఐదారు సంవత్సరాలుగా ఆదాయం పరిశీలిస్తే, 2016- 17లో తైబజార్ వేలం పాట నిర్వహించగా రూ.3లక్షల 80వేలు, 2017- 18లో రూ.5 లక్షలు, 2018- 19లో రూ.6.21 లక్షలు, 2019-20లో 7.57 లక్షలు, 2020-21లో 4.87 లక్షలు, 2021- 22లో 7.37 లక్షలు, 2022- 23లో 8.18 లక్షలు, 2023- 24లో 9.10 లక్షల ఆదాయం వచ్చింది. 2024- 25 సంవత్సరానికి ఏప్రిల్ మొదటి వారంలో వేలం నిర్వహించాల్సి ఉండగా, అప్పట్లో ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడింది. అనంతరం వేలం నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ.. పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తాత్కాలికంగా గ్రామ పంచాయతీ సిబ్బందిచే తై బజార్ వసూలు చేస్తున్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో వేలం నిర్వహిస్తే, రూ.10 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

కనీస వసతులు కరవు

సంత ద్వారా పంచాయతీ ఆదాయం వస్తున్నప్పటికీ.. వసతులు కల్పించడంలో జీపీ అధికారులు విఫలమయ్యారు. క్రయవిక్రయదారులకు తాగునీరు కాదుకదా.. కనీస అవసరాలను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆదాయంపైనే తప్ప.. ప్రజల అవసరాలు పట్టవా అని ప్రశ్నిస్తున్నారు. సంతకు సొంత స్థలం కేటాయించడంతో పాటు, వేసవిని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

“మోడల్ మార్కెట్ నిర్మించాలి



సమస్యలతో కడ్తాల్ సంత కొట్టుమిట్టాడుతోంది. జనాభాకు అనుగుణంగా సంతకు స్థలం కేటాయించాలి. అన్ని రకాల సరకులు విక్రయించుకునేందుకు మోడల్ మార్కెట్‌ను నిర్మించాలి. వసతులు కల్పించాలి.

– మహ్మద్ లాయక్అలీ, కడ్తాల్

సమస్యలు తీర్చండి



సంతతో పంచాయతీకి ఆదాయం వస్తున్నా.. ప్రజల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో క్రయవిక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు తదితర సౌకర్యాలతో పాటు.. మరుగుదొడ్లు నిర్మించాలి. కాలానికి అనుగుణంగా సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలి.

– జగన్‌నాయక్, రైతు, టాక్‌రాజ్‌గూడ

ఓపీఎస్‌ను అమలు చేయాలి

- పీఆర్టీయూటీఎస్ నేతల డిమాండ్
- తహసీల్దార్లకు వినతి పత్రాల అందజేత

ఇబ్రహీంపట్నం: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూటీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యకంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఓ వైపు పాత విధానాన్ని అమలు చేయాలని నిరసనలు చేస్తున్న నేపథ్యంలో.. మరో వైపు ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ అమలు చేయడానికి గెజిట్‌ను విడుదల చేసిందని తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు వరకాల పరమేశ్, మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, రంగారెడ్డి, మల్లేశ్, మురారి, రాజు, కృష్ణమోహన్, శంకర్, రోజ, లలిత, నీలిమలు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని పీఆర్టీయూటీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు తిరుమలేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, జిల్లా మాజీ అధ్యక్షుడు జగన్మోహన్‌గుప్తా ఉన్నారు.

మంచాలలో..

మంచాల: సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జావెద్, వెంకటేశ్, రాములు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నేతలు

ఇర్విన్‌ను మండలముగా గుర్తించాలి

మాడ్గుల: ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ అఖిలపక్షం నాయకులతో కలిసి ఇర్విన్, మాల్ ప్రధాన రహదారిపై సోమవారం గ్రామస్తులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. జిల్లా మండలాల పునర్విభజన సమయంలో ఇర్విన్‌ను మండలముగా గుర్తించాలని ప్రజలు కోరారని గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్ష మేరకు 9 గ్రామాలతో ఇర్విన్‌ను మండల కేంద్రంగా ప్రకటించేందుకు గత ప్రభుత్వం ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించిందని తెలిపారు. ప్రభుత్వం మారడంతో మండల ఏర్పాటుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల కోరిక మేరకు ఇర్విన్‌ను మండలం కేంద్రంగా ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు.



రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు

భూ బాధితులకు అండగా ఉంటాం

కాంగ్రెస్ శ్రేణులు నోరు అదుపులో పెట్టుకోవాలి: బీజేపీ నాయకులు

కడ్తాల్: భూ బాధిత రైతుల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని, వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో ఉంచుకొని మాట్లాడాలని, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని విమర్శించే స్థాయి మీది కాదని హితవు పలికారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు, తమకు న్యాయం చేయాలని ఆచారిని కోరారని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు ఆయన బాధిత రైతులతో మాట్లాడి, సమస్యను ప్రభుత్వ దృష్టి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో అధికార పార్టీ నాయకులు కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతూ.. సమస్యను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. భూ బాధిత తరపున ఆచారి పోరాటం చేస్తారని, కాంగ్రెస్ శ్రేణులు వ్యక్తిగత దూషణలు, విమర్శలు మానుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఆ పార్టీ నాయకులను గ్రామాల్లో తిరగనీయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రెడ్యానాయక్, రాందాస్‌నాయక్, శ్రీశైలంగౌడ్, వెంకటేశ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆచారిని విమర్శించే స్థాయి ఎవరికీ లేదు

ఆమనగల్లు: ప్రజల కోసం పనిచేస్తున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని విమర్శించే స్థాయి ఎవరికీ లేదని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కమిషన్ సభ్యుడిగా పనిచేసిన సమయంలో ఆచారి ఈ ప్రాంత అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. సమావేశంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, నాయకులు రాంరెడ్డి, శ్రీకాంత్‌సింగ్ ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మన్నెగూడ బస్తీ దవాఖానలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాగన్నగూడ వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సామ భీంరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు పరీక్షలు చేయనున్నామని పేర్కొన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం సులువుగా బయటపడే అవకాశం ఉంటుందని, ప్రజలు శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఆదమరిస్తే అంతే..



కొంగరకలాన్ రోడ్డుపై కుంగిన మ్యాన్ హోల్

ఇబ్రహీంపట్నం రూరల్: నడిరోడ్డుపై మ్యాన్ హోల్ నోరు తెరచి ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం ఆదమరచినా వాహనదారులు ప్రమాదంలో పడకతప్పదు తప్పదు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్ చౌరస్తా నుంచి బ్యాంక్ వెళ్లే దారిలో పరమేష్ ఇంటికి సమీపాన మ్యాన్ హోల్ కుంగి, మూత లోపలికి దిగబడింది. ఇదే మార్గంలో గతంలో రెండు సార్లు మరమ్మతు చేశారని, అయినా ఉపయోగం లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు. నాసిరకం పనులే ఇందుకు కారణమని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే మ్యాన్ హోల్‌కు మరమ్మతు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు

2 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మండల పరిధి శెట్టిపల్లి గ్రామంలో ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 3న స్వామివారి కల్యాణం, 4న రథోత్సవం జరగనుంది. ఈ ఉత్సవాలను ఏటా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నగరంలోని ఆయన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు సత్యం, దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు బుచ్చయ్య, జంగయ్యగౌడ్, రవి, నరేశ్, వంశీ, వెంకటేశ్, జంగాచారి ఉన్నారు.

3 నుంచి వాలీబాల్ టోర్నీ

ఉత్సవాల్లో భాగంగా 3 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి నాలుగో ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ సత్యం తెలిపారు. పాల్గొనే జట్లు 2వ తేదీ లోపు ఎంట్రీఫీజు చెల్లించాలన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116, షీల్డ్, ద్వితీయ బహుమతిగా 10,116, షీల్డ్, తృతీయ బహుమతిగా రూ.5,116, జ్ఞాపిక అందజేస్తామని ఆయన చెప్పారు. పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు.

పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోండి



పాడిరైతులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

కడ్తాల్: పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ అన్నారు. సోమవారం మండల పరిధి మర్రిపల్లి గ్రామంలో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పశువులకు సాధారణ, సంతానోత్పత్తి పరీక్షలు చేశారు. 24 పశువులకు గైనకాలజీ, 13 మూగజీవాలకు సాధారణ పరీక్షలతో పాటు 4రిపీట్ బ్రీడర్ కేసులు పరిశీలించి మందులు అందజేశారు. 21 పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, 21 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. డీఎల్‌డీఏ సూపర్‌వైజర్ లక్ష్మయ్య, జూనియర్ వెటర్నరీ అధికారులు వెంకటయ్య, శ్రీశైలం, గోపాల మిత్ర శివ, పాడి రైతులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడ శ్రీ సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కామిశెట్టి రమేష్, ఉపాధ్యక్షుడిగా మురళి, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వర రావు, కోశాధికారిగా చంద్రశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ప్రవీణ్ కుమార్, వెంకటేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంతోష్, శివ సాయి, గౌరవ సలహాదారులుగా సురేష్ రెడ్డి, రవీంద్ర కుమార్, రాములు, నవీన్ రెడ్డి, రామాంజనేయులను నిమించారు.

ఉత్సవ కమిటీ..

అధ్యక్షుడిగా భరత్, మహిళా అధ్యక్షురాలుగా ప్రభావతి, ఉపాధ్యక్షులుగా నవీన్ రెడ్డి, శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా రాం ప్రకాష్, కార్యదర్శులుగా సాయి, దీక్షిత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శివ సాయి, గణేశ్, లింగయ్య, నరహరి రెడ్డిలను ఎన్నుకున్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

బీఆర్‌ఎస్‌ది అవినీతి పాలన

కందుకూరు: బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయంగా కొనసాగిందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన సబితారెడ్డి.. ఎంతమందికి సంక్షేమ పథకాలు అందజేశారని ప్రశ్నించారు. ప్రజలను మోసగిస్తూ పాలన కొనసాగించిన ఆ నాయకులు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక్కసారి వారు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ అర్హులందరికీ తప్పకుండా అందుతాయన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాదపు వెంకటేశ్‌గౌడ్, పార్టీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, మాజీ ఎంపీపీ పి.మహేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చండీయాగంలో ప్రజాప్రతినిధులు



హరీశ్‌రావును సన్మానించిన బీఆర్‌ఎస్ నాయకులు

కడ్తాల్: కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో కోటి దీపోత్సవ పురోహితులు రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో సోమవారం రుద్ర సహిత శత చండీయాగం నిర్వహించారు. యాగానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డిని యాగం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కసిరెడ్డి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు వెంకటేశ్వర్లు గౌడ్, సురేందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, బాలరాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.

హాజరైన మాజీ మంత్రి

యాగానికి హాజరైన ఎమ్మెల్యే హరీశ్‌రావును డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండల నాయకులు పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, హరీశన్న యువసేన నియోజక వర్గ అధ్యక్షుడు మహేశ్‌కేశని ఉన్నారు.

దండిగా దరఖాస్తులు



చింతుల్ల సభలో దరఖాస్తు చేసుకుంటున్న మహిళలు (ఫైల్)



ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

- గతేడాది ప్రజాపాలనలో 16,998 అర్జీలు
- జాబితాలో కానరాని అర్హుల పేర్లు
- వెల్లువెత్తిన నిరసనలు..
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్న ప్రభుత్వం
- నాలుగు రోజుల సభల్లో 6,038 అప్లికేషన్లు

యాచారం: ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు దండిగా వచ్చాయి. ఈ నెల 21 నుంచి 24 వరకు మండల పరిధి 24 గ్రామాల్లో నిర్వహించిన సభల్లో రేషన్ కార్డుల కోసం 2,443, ఇందిరమ్మ ఇళ్లకు 2,283, రైతు భరోసాకు 356, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 956 మంది పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నారు.

213 మందికి మంజూరు పత్రాలు

ప్రజాపాలన, కులగణనలో వచ్చి దరఖాస్తుల ఆధారంగా సభలకు ముందు నాలుగైదు రోజుల పాటు అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. అనంతరం చేపట్టిన సభల్లో అర్హుల జాబితాను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రదర్శించారు. ఇందులో తమ పేర్లు లేవంటూ అత్యధికులు ఆందోళన చేపట్టగా.. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో చింతుల్ల, తాడిపర్తి, తమ్మలోనిగూడ, నల్లవెల్లి సభల్లో ప్రాంత వాసులు దరఖాస్తు చేసుకున్నారు. గణతంత్ర దినోత్సవాన తక్కళ్లపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 79, ఇందిరమ్మ ఇళ్ల 109, రేషన్‌కార్డులు 213 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

అర్హులకు న్యాయం జరిగేనా?

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో అరు గ్యారంటీలకు ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో మండల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు తదితర పథకాల కోసం 16,998 దరఖాస్తులు వచ్చాయి. కానీ నిన్నమొన్న జరిగిన గ్రామసభల్లో కొద్ది మందినే అర్హులుగా పేర్కొనడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేయగా.. అప్రమత్తమైన ప్రభుత్వం మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఆ మేరకు అర్జీలను స్వీకరించింది. సంక్షేమ పథకాల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పాలకులు, అధికారులు స్పష్టంచేశారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

“పేదలను గుర్తించాలి



అధికారులు, పాలకులు గ్రామాల్లో మరోసారి సర్వే చేయాలి. ఇంటింటికి వెళ్లి నిరుపేదలను గుర్తించాలి. అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి. చాలా మంది పేదలకు ఇంటి స్థలాలు లేవు. స్థలాలు చూపించి, ఇళ్లు మంజూరు చేస్తే బాగుంటుంది. గ్రామ సభల్లో అర్హుల లిస్టు తప్పులతడకగా ఉంది. అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది.

– ఆలంపల్లి నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి